క్లుప్తంగా

116 మందికి కంటి పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం శ్రీషిర్డీ సాయి మందిరంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 116 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఏడుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి తరలించారు. 44 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా వీరికి వచ్చేనెల 9న ఉచితంగా కళ్లజోళ్లను అందిస్తామని శ్రీవెంకటేశ్వర కమ్మ సంఘం నిర్వాహకులు తెలిపారు.

కురిసింది వాన

బిక్కవోలు: వేసవి ఎండల తీవ్రతతో అలాడిపోతున్న ప్రజలకు కాస్త ఊరట లభించింది. శనివారం రాత్రి వర్షం కురువడంతో వాతావరణం చల్లబడింది. జనం సేదతీరారు. మండలంలోని 61.2 వర్షం ప్రాతం నమోదయ్యిందని అధికారులు తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

గోకవరం: తిరుమలాయపాలెంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, తదనంతరం తొలగింపు ఘటనలో బాధితులకు అండగా ఉంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో ఆదివారం ఆయన పర్యటించారు. తమను సామాజిక బహిష్కరణ చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్సీలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంబేడ్కర్ విగ్రహం తొలగించిన చోటే విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ నిందితులపై తగు చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు సంయమనం పాటించాలన్నారు. ఈ ఘటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. అనంతరం ఎస్సీపేట వాసులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాటు సారా బట్టీలపై ఆకస్మిక దాడులు



దాడులలో స్వాధీనపర్చుకున్న నాటు సారా తయారీ సామగ్రితో అధికారులు

రాజానగరం: రఘునాథపురం, భూపాలపట్నం, శ్రీరామపురం, శ్రీకృష్ణపట్నంలలో నాటుసారా బట్టీలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించి, 5,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. జిల్లా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు ఈ దాడుల జరిగాయి. నాటు సారా తయారీదారులపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని, సారా వ్యాపారాలు మాని స్వచ్ఛందంగా ముందుకు వస్తే, వారికి ప్రభుత్వం ద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు చూపిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. ఈ దాడులలో రాజమహేంద్రవరం, రంగంపేట, దేవరపల్లి, నిడదవోలు సీఐలు పి.హనుశ్రీ, అప్పారావు, వెంకటరమణ, వెంకటలక్ష్మీశ్రీ, సుధా, సత్యనారాయణ, ఎస్సైలు చిట్టిబాబు, అప్పారావు, నాగేశ్వ్రావు, శేఖర్‌బాబు, సుధీర్, రామశేఖయ్య, నిరంజన్, వీరబ్రహ్మం, బాసంతి పాల్గొన్నారు.

ఇంటివద్దకే వైద్య పరీక్షలు

యాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జక్కంపూడి



యాప్‌ను ఆవిష్కరించిన జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు డబ్బు, సమయం ఆదా అయ్యేందుకు ఇంటివద్దకే వైద్య పరీక్షలు అందించే ఆక్సోలేట్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. వైద్య పరీక్షలను సులభతరం చేసేందుకు అమరావతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నిర్వాహకులు రూపొందించిన ఆక్సోలేట్ యాప్‌ను ఆయన రాజమహేంద్రవరంలో ఆవిష్కరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శేష దీప్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మౌనిక, డైరెక్టర్లు కె.సిద్ధార్థ, పి.అనిల్‌కృష్ణ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లు సిద్ధం

- గ్రామీణ యువతకు ఉచితంగా అందుబాటులోకి..
- బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నంలో నేడు ప్రారంభం



బూరుగుపూడిలో అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైన ఓపెన్ జిమ్

మధురపూడి: గ్రామీణ ప్రాంతాల్లో యువతలో ఫిట్‌నెస్ పెంచాలన్న లక్ష్యంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పట్టణాల్లో డబ్బులు వెచ్చించి ఫిట్‌నెస్‌కు శ్రమిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం యువతను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడానికి వీటిని ఏర్పాటు చేసింది. కోరుకొండ మండలం బూరుగుపూడి, శ్రీరంగపట్నం, గాదరాడ గ్రామాల్లో ఒక్కోటి రూ.20.30 లక్షలతో ఈ ఫిట్‌నెస్ సెంటర్లను అన్ని హంగులతో నిర్మించారు. రుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వ్యాయామశాలలను సోమవారం రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభిస్తారు. ఈ వ్యాయామశాలలకు పంచాయతీ శాఖ స్థలాలను అందించింది. అయితే వీటి నిర్మాణం, వ్యాయామ పరికరాల ఏర్పాటు, శాలలను ఆహ్లాదంగా తీర్చిదిద్దే పని రుడా చేపట్టింది. ఓపెన్ జిమ్‌లను ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగా నిర్వహిస్తారు.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ

యువతలో ఫిట్‌నెస్ పెంచడానికి ఏర్పాటు చేసిన ఈ వ్యాయామ శాలలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతంలోని యువత ఆ సమయాల్లో వ్యాయామాన్ని చేసుకునేందుకు అనువుగా తీర్చిదిద్దారు.



శ్రీరంగపట్నంలో వ్యాయామశాల

10 రకాల వ్యాయామ పరికరాలు

ఈ వ్యాయామశాలల్లో 10 రకాల వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. శరీరంలోని అన్ని భాగాలు కదిలేందుకు అనువైన పరికరాలు ఉన్నాయి. శాలలో 10 సీట్లతో వ్యాయామం చేసుకోవచ్చు. ఇక్కడ స్కై వాకర్, డబుల ఎయిర్ వాకర్‌తో మంచి వ్యాయామం చేసుకోవచ్చు. థాయ్‌చి స్పిన్నర్ 4 వీల్ ద్వారా దేహదారుఢ్యాన్ని సాధించవచ్చు. సీటెడ్ పుల్లర్ డబుల్ పరికరం ద్వారా కూర్చుని వ్యాయామాన్ని చేయవచ్చు. దీంతో కాళ్లు, నడుము పై భాగంలో వ్యాయామం జరుగుతుంది. హార్స్ రైడర్ ద్వారా మంచి శక్తిని పొందవచ్చు.

యువతను ఆరోగ్యంగా తీర్చిదిద్దడానికి



యువతను ఆరోగ్యంగా తీర్చిదిద్దడానికి బహిరంగ వ్యాయామ శాలలను ఏర్పాటు చేశాం. శాలలకు చుట్టూ పటిష్టమైన గోడ నిర్మించి, రంగులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరిక మేరకు రాజానగరం నియోజకవర్గంలోని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశాం.

– మేడపాటి షర్మిలారెడ్డి, చైర్మన్, రుడా, రాజమహేంద్రవరం

డబ్బు చెల్లించలేని వారికోసం



ఆసక్తి ఉన్నప్పటికీ యువత డబ్బు చెల్లించలేక, వ్యాయామ శాలలకు వెళ్లలేకపోతున్నారు. వారికి బహిరంగ వ్యాయామ శాలలు ఉపయోగపడతాయి. వీరంతా రోడ్లపై వాకింగ్ చేస్తున్నారు. వాకర్స్ కూడా దీన్ని ఉపయోగించుకోవాలి. వాకింగ్‌కు సంబంధించిన పరికరాలు ఉన్నాయి. ఇవి పెద్దవారికి ఉపయోగపడతాయి. వీటి నిర్మాణంలో రుడా సహకరించింది.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటనరసింహాచార్యులు స్వామివారికి విశేష పూజలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గురుపౌర్ణమికి అంకురార్పణ

పెదపూడి: జి.మామిడాడలోని బోడవారి వీధిలో ప్రసిద్ధి చెందిన కలియుగ దైవం షిరిడీ సాయిబాబా గురుపౌర్ణమి వేడుకలు వచ్చే నెల మూడో తేదీన జరగనున్నాయి. ఈ వేడుకలకు ఆదివారం అంకురార్పణ పూజలు చేశారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్, ఫ్యామిలీ హెల్త్ క్లబ్, ద్వారంపూడి అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ జూలై 3 తెల్లవారుజామున 4 గంటల నుంచి బాబా వారికి మేలుకొలువు పూజలు చేస్తారన్నారు. అనంతరం పంచామృత అభిషేకాలు, రథోత్సవం, అనంతరం భారీ అన్న సమారాధన చేస్తారన్నారు. సాయంత్రం హారతి, పవళింపు సేవతో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా ముగుస్తాయన్నారు.

దివాన్‌చెరువులో ఉచిత వైద్య శిబిరం



ఉచిత శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రాజానగరం: వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకుంటే మంచాన పడతారని, పక్షవాతం వస్తుందనేది కేవలం అపోహ మాత్రమేనని, అందులో నిజం లేదని రాజమహేంద్రవరానికి చెందిన వేద స్పైన్ సెంటర్ వైద్యులు డాక్టర్ తేజో ఫణీంద్ర అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వెన్నెముక శస్త్ర చికిత్స గురించి జనంలో ఉన్న అపోహలను నివారించే ప్రయత్నం చేశారు. ఈ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిలో 98 శాతం మంది చికిత్స జరిగిన వారం రోజుల నుంచే ఎటువంటి ఇబ్బందీ లేకుండా వారి పనులు చేసుకోగలుగుతున్నారన్నారు. శిబిరంలో 120 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వెన్నెముక బలాన్ని ప్రత్యేక పరికరం ద్వారా తెలుసుకునేందుకు అవసరమైన వైద్య పరీక్షను కూడా ఉచితంగా నిర్వహించారు. శిబిరంలో వైద్య సిబ్బంది సతీష్, స్వర్ణ, లోకేష్ సేవలందించారు.

ఎస్సీల వర్గీకరణే మాదిగల అంతిమ లక్ష్యం



సీతానగరంలో ఎమ్మార్పీఎస్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

సీతానగరం: ఎస్సీల వర్గీకరణే మాదిగల అంతిమ లక్ష్యమని ఆ సంఘం కోస్తా ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు అన్నారు. ఆదివారం సీతానగరంలో విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ కార్యాచరణలో భాగంగా జిల్లా, నియోజకవర్గ, మండలాల వ్యాప్తంగా మహాజన సోషలిస్టు పార్టీ నిర్మాణానికి నాయకత్వాన్ని బలపరిచేందుకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సీతానగరం మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా మనెల్లి సుధీర్‌కుమార్‌ను ఎంపిక చేశామన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల వారందరూ గ్రామాలలో నూతన కమిటీల ఏర్పాటుకు కన్వీనర్‌కు సహకరించాలని సూచించారు. వచ్చే నెలలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖండవల్లి సత్తిబాబు, కత్తి సోమరాజు, మన్నెల్లి మదు, చిడిపి డార్విన్, పోలిన రాజేష్, నారే చందు పాల్గొన్నారు.

అధికారుల తీరుకు నిరసనగా ర్యాలీ



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం సభ్యులు

గోకవరం: దేవదాయ శాఖ అధికారుల నిర్ణయాలు పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో ఆదివారం ఆయన సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాల నుంచి లేని నిబంధనలు సుందరమ్మ సత్రం భూములకు బహిరంగ వేలంపాటలు నిర్వహించే సమయంలో విధించడం దారుణమన్నారు. గత కొన్నేళ్లుగా సత్రం భూములను గ్రామానికి చెందిన పలువురు అన్యాయంగా అనుభవిస్తుంటే లేని నిబంధనలు ఇప్పుడు విధించడం చూస్తుంటే అధికారులు భూస్వాములకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సత్రం భూముల బహిరంగ వేలంలో నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారుల తీరుకు నిరసనగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, నాయకులు డి.సురేష్, గోలి ముసలయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దోసకాయలపల్లిలో 'గడప గడపకూ'

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా నిర్వహించనున్నారు. కొన్ని రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా జరుగుతోంది. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కోనేరు విస్తరణ, అభివృద్ధి పనులకు, గుమ్ములూరులో చెరువు విస్తరణ పనులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శంకుస్థాపన చేయనున్నారు.

'జగనన్న సురక్ష'లో సమస్యల గుర్తింపు



అనపర్తిలో సర్వే చేస్తున్న ఈఓపీఆర్డీ కె.పద్మజ



రాజానగరంలో సమస్యలు నోట్ చేసుకుంటున్న సిబ్బంది

అనపర్తి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు ఆదివారం రెండో రోజు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా ఆయా కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. అదేవిధంగా సచివాలయాల ద్వారా మంజరయ్యే 11 రకాల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని మహేంద్రవాడ-1, అనపర్తి-1 గ్రామ సచివాలయాల పరిధిలో మండల విస్తరణాధికారి కె.పద్మజ సిబ్బందితో కలిసి సర్వే చేపట్టారు. ప్రభుత్వ సేవలకు గాను ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఆమె సచివాలయాల్లో ఆన్‌లైన్ చేయించి దరఖాస్తుదారులకు టోకెన్లు అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వచ్చే నెల నాలుగో తేదీ నుంచి 27వ తేదీ వరకూ ప్రతి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. మండలంలోని రెండు టీం ఉంటాయని, మొదటి టీంలో తహసీల్దార్ కె.పోసిబాబు, ఈవోపీఆర్డీ జి.భవాని, ఆర్ఐ నందకిషోర్, సీనియర్ అసిస్టెంట్ మంగరాజు ఉంటారన్నారు. మరో టీంలో తన పాటు రెవెన్యూ డీటీ వీఎస్‌వీవీ కృష్ణ, మండల పరిషత్ సీవో కె.మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.మహేష్‌రెడ్డి ఉంటారన్నారు. మొదటి టీం సభ్యులు వచ్చే నెల 4న కొమరిపాలెం సచివాలయం-1, 6న కొమరిపాలెం-2, 7న కొంకుదురులో సమావేశం నిర్వహిస్తారన్నారు. 11న కొంకుదురు-2, 13న తోస్సిపూడి, 14న పందలపాక-1, 18న పందలపాక-2, 20న ఆరికరేవుల, 21న మెళ్లూరు, 25న రంగాపురంలోని సభలు జరుగుతాయన్నారు. రెండో టీం సభ్యులు 4న ఇలపల్లి, 6న ఊలపల్లి-1, 7న ఊలపల్లి-2, 11న బలభద్రపురం-1, 13న బలభద్రపురం-2, 14న కాపవరం, 18న బలభద్రపురం-3, 20న బిక్కవోలు-2, 21న బిక్కవోల-3, 25న బిక్కవోలు-4, 27న బిక్కవోలు-1న సచివాలయాల్లో సమావేశం నిర్వహిస్తామన్నారు. 11 రకాలు సర్వీసులు అందిస్తున్నామని తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

రాజానగరం: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకుని, పూర్తి స్థాయిలో వాటిని పరిష్కరించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని ఎంపీపీ మండారపు సీతారత్నం అన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, స్థానిక కేడర్ అంతా కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రజల నుంచి సమస్యలు తెలుసుకునే ఈ కార్యక్రమం నియోజకవర్గంలో ప్రారంభమైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న వివిధ సేవల గురించి ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు వాటిని పొందడంలోగాని, ఇతరత్రాగాని ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ప్రశ్నిస్తూ ప్రజల సమస్యలు నోట్ చేసుకుంటున్నారు. జూలై ఒకటి నుంచి గ్రామాలకు వచ్చే అధికారుల బృందాలు వీటిని అక్కడికక్కడే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వివరించారు.

పేదల జీవితాలలో 'నవరత్నాల' వెలుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాధేయపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఓ గృహిణి సమస్యలు వింటున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: పేదల జీవితాలలో వెలుగులు తీసుకువచ్చి, వారి ఆర్థిక ప్రగతిని మెరుగుపర్చడంలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'నవరత్నాలు' పథకాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాధేయపాలెంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలుకరిస్తూ, గడచిన నాలుగేళ్లలో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఇదే సమయంలో సీఎం జగన్ పాలన విధానం ఏవిధంగా ఉంది?, గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ల సేవలు ఏవిధంగా లభిస్తున్నాయి? తప్పులు ఏమైనా ఉన్నాయా? ఉంటే నిర్భయంగా చెప్పండి, సరిదిద్దుకుందామంటూ చిరునవ్వుతో ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు.

రూ.కోట్లాది రూపాయలతో అభివృద్ధి

జగనన్న ప్రవేశపెట్టిన 'నవరత్నాలు' పథకాల ద్వారా గడచిన నాలుగేళ్లలో ఈ గ్రామంలో 2,984 మందికి ఆర్థిక ప్రయోజనాలను అందిస్తూ రూ.11,60,30,946 తో వివిధ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్, తదితర భవనాలతోపాటు నాడు - నేడు పథకం ద్వారా రూ.51.41 లక్షల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపరచి, రూ.67 లక్షలతో ఓహెచ్ఆర్‌ని నిర్మించామన్నారు. రూ. 90 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు పటిష్టపరిచామంటూ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 60 మందికి సంపూర్ణ గృహహక్కు పథకంలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు.

జగనే సీఎం, మీరే మా ఎమ్మెల్యే

రాష్ట్రానికి సీఎం జగన్, మాకు మీరు ఎమ్మెల్యేగా ఉండాలంటూ జక్కంపూడి రాజాకు పలుచోట్ల మహిళలు ఆశీస్సులు అందజేశారు. గతంలో పథకాల కోసం కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లమని, ఇప్పుడు అవి మా ఇంటికే వస్తున్నాయంటూ ఆనందం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సర్పంచ్ నురుకుర్తి దుర్గ, ఉపసర్పంచ్ రావూరి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు అనదాసు సాయిరామ్, ఎరుబండి రాంబాబు, హరిబోలు వెంకటరమణ, గోసాల చిన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తిపోతల పథకం

- టీడీపీ నిర్వాకంతో చతికిలపడిన చాగల్నాడు ఎత్తిపోతల పథకం
- ఇరవై ఏళ్లుగా నిర్వహణ శూన్యం
- మూడో వంతు భాగానికి కూడా నీరందని దుస్థితి

మండలాల వారీగా ఆయకట్టు

మండలం	ఆయకట్టు	వాస్తవ సాగు
బిక్కవోలు	4975	0
అనపర్తి	2439	0
మండపేట	1656	0
రాజమండ్రి గ్రామీణం	1150	415
కోరుకొండ	1667	1050
రంగంపేట	14238	2850
రాజానగరం	8875	7500
మొత్తం	35000	11450

రంగంపేట: చాగల్నాడు ఎత్తిపోతల పథకం చతికిలపడింది. అనుకున్న స్థాయిలో సాగునీరందించడంలో లక్ష్యాలను చేరుకోలేకపోయింది. అనపర్తి నియోజకవర్గంలో రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాలతో పాటు మరో నాలుగు మండలాల్లోని మెట్ట భూములకు సాగునీరందించాలనే ఉద్దేశంతో చాగల్నాడు ఎత్తిపోతల పథకం నిర్మించారు. సుమారు 40ఏళ్ల పోరాటం ఫలితంగా 20ఏళ్ల క్రితం సాకారమైంది. ఈ పథకం ఏ దశలోను రైతులకు న్యాయం చేయలేకపోయింది. అధికారిక లెక్కల ప్రకారమే 35 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా 12 వేల ఎకరాలకు అతి కష్టంపై నీరందిస్తోంది.

రంగంపేట మండలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్మించింది. మండల పరిధిలో 14 వేల ఎకరాలకు నీరందిస్తామని చెప్పి, ఇప్పుడు 3 వేల ఎకరాలకు కూడా నీరివ్వడంలేదంటే ఈ పథకం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా నీరందే 12 వేల ఎకరాల్లో 9 వేల ఎకరాలు రాజానగరం మండలానికి చెందినవే. రంగంపేట మండలంలో వడిశలేరు, రంగంపేట, ఎస్టీరాజాపురం గ్రామాలకే నీరందుతోంది.

ఈ పథకానికి రూ.80 కోట్లు ఖర్చు

2002 అక్టోబరు ఒకటిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిని ఆర్భాటంగా ప్రారంభించారు. నిధుల కోసం ఈ పథకానికి 7 మండలాలకు చెందిన 35 వేల ఎకరాలకు ఆయకట్టుగా చూపారు. అందులో మండపేట మండలంలో 1,656 ఎకరాలు కలిపారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ మండలాలకు చెందిన భూములు కూడా ఉన్నాయి. అయితే ప్రధాన ఆయకట్టు మండలాలుగా రంగంపేట, రాజానగరం సింహభాగం ఆక్రమించాయి. వాస్తవానికి వచ్చేటప్పటికి రంగంపేట మండలం బాగా వెనుకబడిపోగా ఇది రాజానగరం మండలానికి నీరందించే పథకంగా మిగిలిపోయింది.

ప్రధాన లోపాలు

ఈ పథకం కోసం గోదావరి నది ఒడ్డున కాతేరు వద్ద ఒక లిఫ్ట్, కోలమూరు వద్ద రెండో లిఫ్ట్, పాలచర్ల వద్ద మూడో లిఫ్ట్ నిర్మించారు. ఈ మూడు లిఫ్టులు ఏక కాలంలో పని చేయకపోవడం వల్ల పథకం లక్ష్యం నెరవేరడంలేదు. దీనికి తోడు సుదీర్ఘమైన పంట కాలువలు పూడుకుపోయాయి. రంగంపేట మండలం పరిధిలో 2020లో అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి లక్షలాది రూపాయల సొంత నిధులు ఖర్చు చేసి కాలువలు బాగు చేయించారు. అయినా పూర్తి స్థాయిలో నీరందడంలేదు. ఈ కారణంగా వెంకటనగర్ ఎత్తిపోతల పథకం నీటిని రంగంపేట మండలం ముకుందవరం వద్ద చాగల్నాడు కాలువలోకి వదిలి రైతులకు కొంత ఉపశమనం కలిగించారు. దీని వల్ల మండలంలోని ముకుందవరం, సుభద్రంపేట, దొడ్డిగుంట, సింగంపల్లి గ్రామాలకు కాస్త నీరందుతోంది. లేకపోతే చాగల్నాడు అరకొర నీటి పంపిణీలో ఏకంగా నీటియుద్ధాలే జరిగేవి.



గోదావరి గట్టు కాతేరు వద్ద చాగల్నాడు ఎత్తిపోతల పథకం



పాలచర్ల వద్ద గోదావరి జలాలు

పులి మీద పుట్రలా

ఇప్పుడీ పథకానికి మరొక కొత్త సమస్య ఎదురైంది. వడిశలేరు నుంచి మల్లిపూడి వరకూ 21 కిలోమీటర్ల పొడవున్న చాగల్నాడు కాలువలో 10-11 కిలోమీటర్ల మధ్య 800 మీటర్లు కాలువను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల పూడ్చివేసి పంట భూమిగా మార్చివేశారు. దీనివల్ల పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, మల్లిపూడి భూములకు నీటి మార్గం పూర్తిగా కనుమరుగైంది. దీనిని వెంటనే పునరుద్ధరించాలి.